దసరా సంబరాలు ప్రారంభం


పూజా సామగ్రి అమ్మకాలు


పెందుర్తిలో ఓ స్వీట్ షాప్‌లో మిఠాయిలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


మద్యం దుకాణం వద్ద రద్దీ


పెందుర్తిలో దిష్టిసామగ్రి విక్రయాలు

- గాంధీ జయంతి నాడే పండగ రావడంతో ముందస్తుగానే అంతా సిద్ధం
- బుధవారమే పొట్టేళ్ల వేట ప్రారంభం
- కిటకిటలాడిన మద్యం షాపులు, బార్లు
- పండగ సామగ్రి కొనుగోలుదారులతో ప్రధాన కూడళ్లు రద్దీ

పెందుర్తి: దసరా సంబరాలు ప్రారంభమయ్యాయి. మాంసాహార ప్రియులు, మద్యపాన ప్రియులు ఓ ముందుగానే పండగ చేసుకున్నారు. గురువారం దసరాతో పాటు మహాత్మాగాంధీ జయంతి కావడంతో బుధవారమే అంతా 'సర్దు'కున్నారు.

ఉదయం నుంచి పొట్టేళ్ల వేటలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి వరకు దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. ఇక మద్యం దుకాణాల వద్ద రాత్రి వరకు విపరీతమైన తాకిడి కనిపించింది. మరోవైపు పూజా సామగ్రి కొనుగోళ్లతో నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లు కిటకిటలాడాయి.

ఆఫర్లే ఆఫర్లు : దసరా అంటేనే కొత్త వాహనాలు, గృహోపకరణాల కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపుతారు. ఈ క్రమంలో బుధవారం ద్విచక్ర వాహనాలు, కార్ల షోరూములు రద్దీగా మారాయి. జీఎస్టీ తగ్గింపుతో పాటు ఆయా షోరూముల్లో ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్లు పెట్టడంతో కొనుగోళ్లకు జనం ఆసక్తి చూపారు. మరోవైపు ఎలక్ట్రానిక్ పరికరాల దుకాణాల్లో కూడా ఆఫర్లు వెల్లువెత్తడంతో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లతో పాటు ఇతర సామగ్రిని భారీ ఎత్తున కొనుగోలు చేశారు. దసరా ముందు రోజు పెందుర్తిలో పండగ వాతావరణం కొట్టొచ్చినట్టు కనిపించింది. పూలదండలు, దిష్టిసామగ్రి, దుర్గమ్మ పటాలు, ఇతర పూజాసామగ్రి కొనుగోలుదారులతో కూడళ్లు కిటకిటలాడాయి. మిఠాయి దుకాణాల్లో సందడి కనిపించింది.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి సహస్రనామార్చన విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 1001నామాలతో స్వామికి అర్చన జరిపారు. విశేషంగా హారతులు ఇచ్చారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

జయజయహే.. మహిషాసురమర్దిని

- నవమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు


ఎస్ఆర్ పురంలో మహిషాసురమర్దినిగా కనకదుర్గమ్మ


సుజాతనగర్‌లో మహిషాసురమర్దినిగా కనకదుర్గమ్మ


సప్తగిరినగర్‌లో చందనాలంకరణలో అలమేలు మంగమ్మ


శ్రమశక్తినగర్‌లో మహిషాసురమర్దినిగా పంచముఖ గాయత్రీ దేవి


పెందుర్తి అయ్యప్ప దేవాలయంలో మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు


మహిషాసురమర్దిని అలంకరణలో ఉమాదేవి

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్ల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిషాసురమర్దినిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

- చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మహిషాసురమర్దినిగా అమ్మవారు పూజలందుకున్నారు. ప్రసాద వితరణ చేపట్టారు.
- సప్తగిరినగర్‌లోని అలమేలు మంగమ్మ సన్నిధిలో భారీఎత్తున కుంకుమ పూజలు చేశారు. చందనాలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి మహాకామేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవి బుధవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చిఅమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం


సబ్బవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసి,రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని ఇరువాడలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి బుధవారం డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ అన్యాయంగా వేధిస్తున్నారని చెప్పారు.సుమారు 200 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను హత్య చేశారని తెలిపారు. అనేక మందిపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, అక్రమ కేసులు బనాయించారని చెప్పారు. కార్యకర్తలకు మనోధైర్యాన్ని కల్పించేందుకే పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రారంభించారని చెప్పారు. అక్రమంగా వేధిస్తున్న వారి వివరాలను ఈ బుక్‌లో నమోదు చేయాలని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత...అక్రమంగా వేధించిన కూటమి నాయకులకు చట్టబద్ధంగా బుద్ధిచెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రిబాబు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యాదర్శి కోటాన రాము, జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు హేమంత్ కుమార్,పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్,బోకం రామునాయుడు, వనం అచ్చెంనాయుడు,వడ్డాది అప్పలరాజు,పల్ల కృష్ణ, గొర్లి రాజేష్,భీశెట్టి వెంకటరావు,కోటాన వెంకట రమణ, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఫార్మా కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండగల బోనస్‌ను అక్టోబరు జీతంతో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. బోనస్ అనేది కార్మికులకు బకాయి పడిన వేతనమని, యాజమాన్యాలు ఇష్టానుసారంచెల్లించేది కాదన్నారు. గతంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి బోనస్‌ను సాధించుకున్నారని తెలిపారు. పోరాడితే తప్పా కొన్ని ఫార్మా పరిశ్రమలు బోనస్‌ను చెల్లించడం లేదని చెప్పారు. బోనస్ అమలు జరిగే విధంగా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని ఫార్మా పరిశ్రమలు 20 శాతం బోనస్‌ను కచ్చితంగా చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ఐసీడీఎస్ పెదగంట్యాడ క్లస్టర్ పరిధిలో అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ అధికారి డి.నీలవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో మొత్తం 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు


అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

సబ్బవరం: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్ రావు తెలిపారు. మండలంలోని పెదనాయుడుపాలెంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ అభివృద్ధి లక్ష్యంగా రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్,స్ప్రింకలర్స్‌పై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించినట్టు తెలిపారు. ఈ తగ్గింపు గత నెల 22 నుంచి అమలులోకి వచ్చినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, పోతల కనకరాజు, కోరాడ శ్రీనివాసరావు, పల్ల తాతారావు, కిల్లి సత్యనారాయణ, కోటాన అప్పారావు, ఏఈవో బాలరాజు, వీఏఏ రేణుక పాల్గొన్నారు.


జీఎస్టీ రేట్ల ప్రతులను ప్రదర్శిస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణకీర్తి

పాడి రైతులకు ప్రయోజనం

పరవాడ: జీఎస్టీ తగ్గింపు వల్ల పాడి రైతులకు అనేక విధాల ప్రయోజనం కలుగుతుందని పరవాడ పశు సంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణ కీర్తి అన్నారు. రావాడ శివారు ధర్మారాయుడుపేటలో తగ్గిన జీఎస్టీ రేట్లపై పాడి రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణకీర్తి మాట్లాడుతూ పాడి పరిశ్రమకు సంబంధించిన ఉత్పత్తులను తగ్గిన జీఎస్టీ ధరలకే పొందవచ్చన్నారు. పాల ఉత్పత్తులు, పశువైద్య ఔషధాలు, గడ్డి కోసే యంత్రాలు, పాల క్యాన్లు, డెయిరీ ఫారం పనిముట్లు తగ్గిన జీఎస్టీ రేట్లకే లభ్యమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వాడచీపురుపల్లి పశువైద్యాధికారి సురేష్, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, జీఎస్టీ పర్యవేక్షకులు(విశాఖ) అలివేణి రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్ మద్యం సీసాలు

గోపాలపట్నం: శివారు ప్రాంతాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. చెరువులు, రైల్వే ట్రాక్‌ల వంటి ప్రాంతాల్లో వీరు మద్యం సేవిస్తూ పర్యావరణానికి, ఆయా ప్రాంతవాసులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నుంచి వెంకటాపురం వెళ్లే రోడ్డులో విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ ఇక్కడి చెరువు గట్లపై, చెరువుల్లో, తుప్పల మధ్య సీసాలు, గ్లాసులు వేసేస్తున్నారు. వీటిని గమనించిన జేడీ ఫౌండేషన్ సభ్యులు శానిటరీ సిబ్బంది సహకారంతో వాటిని తొలగించారు. సుమారు అరగంట పాటు సీసాలు ఏరితే జీవీఎంసీ వ్యాన్ నిండిపోయిందని వారు తెలిపారు. 89వ వార్డు శివారుప్రాంతాలపై పోలీసులు నిఘా ఉంచాలని కోరారు. డ్రోన్ల సాయంతో మందుబాబుల ఆగడాలను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.